విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం జాయింట్ కలెక్టర్ స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో ధాన్యం సేకరణ ప్రక్రియపై కస్టోడియన్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యం సేకరణ ప్రక్రియలో కస్టోడియన్ ఆఫీసర్లగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రానున్న రెండు నెలలు వరి పంట కోతలు ముమ్మరంగా కొనసాగుతాయని, ఎక్కువగా యంత్రాలతో నూర్పిళ్లు చేపట్టడం వల్ల ఆర్బికెలకు పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతి మిల్లు వద్ద ఆర్డిఓ, తహసిల్దార్, జిల్లా పౌరసరఫరాల అధికారుల ఫోన్ నంబర్ల వివరాలతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నంబర్లను తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. మిల్లుల వద్దకు ధాన్యం చేరిన 6 గంటల లోపే వాహనాల నుంచి అన్లోడ్ చేయాలని, అలా జరగని పక్షంలో పైఅధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియ ద్వారా రైతులకు పూర్తి మద్దతు ధర అందించడం అందరి బాధ్యత అని, కేటాయించిన విధులు పట్ల ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారిణి వి.పార్వతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీధర్, డి సి ఓ ఫణి కుమార్, వీఆర్వోలు అధికారులు తత్తర్లు పాల్గొన్నారు.

మండలంలో 50 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : ఆర్డీవో

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని 16 సచివాలయాల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2023వ ఖరీఫ్ సీజన్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని అధిగమించాలని ఉయ్యూరు ఆర్డిఓ. దాసిరాజు సూచించారు. మొవ్వ మండలంలో భట్ల పెనుమర్రు గ్రామంలో శనివారంకొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. దానిలోని డీఈవో, టి ఏ ల ద్వారా వివరాలు సేకరించి ధాన్యం కొనుగోలు లో తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై వారికి సూచనలు ఇచ్చారు.జిల్లాలోనే తొలిసారిగా 200 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆన్లైన్ ద్వారా పామర్రు సరఫరా చేసిన గ్రామ ఉపసర్పంచ్ చలసాని వెంకటరత్నం ను, సిబ్బందిని పరోక్షంగా అభినందించారు. అనంతరం భట్ల పెనుమర్రు నుంచి కూచిపూడి వస్తున్న దారిలోని వరి పొలాలను పరిశీలించారు. అలాగేకూచిపూడి పిఎసిఎస్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది నుంచి ఆరాతీసుకున్నారు. అనంతరం మొవ్వ తాసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు పై తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్.తోచర్చించారు. ఉయ్యూరు ఆర్డిఓ గా బాధ్యతలు తీసుకున్న తొలిసారిగా విచ్చేసిన దాసిరాజును డిటి సిహెచ్ గోపాల్ రావు, ఆర్ఐ ఈడ విజయలక్ష్మి, జయ శామ్యూల్,సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

రంగవల్లుల పోటీలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని యలమర్రు గ్రంథాలయ ఆవరణలో మహిళల చే రంగవల్లుల కార్యక్రమం శనివారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పొట్లూరి రవిచంద్ర మాట్లాడుతూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ పరిధిలోని మహిళలు, పాఠశాల బాలికలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. వారోత్సవాల ఆఖరు రోజైన 20వ తేదీన విజేతలకు బహుమతులు అందించనున్నట్లు రవిచంద్ర వివరించారు.

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు విద్యార్థిని కారుణ్యశ్రీ ఎంపిక

విశాలాంధ్ర-గుడివాడ : రోలర్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటిలలో గతంలో బంగారు, రజత పథకాలు సాధించి, జాతీయ స్థాయి పోటిలకు విద్యాల విద్యార్థి కాకి కారుణ్యశ్రీ ఎంపికైనట్లు విద్యాలయ సంస్థల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ తెలిపారు. శనివారం స్థానిక విద్యాలయ పబ్లిక్ స్కూల్‌లో జాతీయస్థాయి రోలర్ స్కేంటింగ్ ఎంపికైన విద్యార్థి కాకి కారుణ్యశ్రీని అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయభాస్కర్ మాట్లాడుతూ 4వ తరగతి విద్యాలయ విద్యార్థిని కాకి కారుణ్యశ్రీ ఇటివల విజయవాడలో జరిగిన ఎంపికలో పాల్గొని, డిసెంబర్ 11వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రం చండీఘర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరుపున ఎంపిక అవడం మన అదృష్టమన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి దుస్థితిపై టీడీపీ-జనసేన నిరసనలు

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్రంలో ప్రధాన రహదారులు ఛిద్రమైనా గుప్పెడు రబ్బిష్ కూడా పోయి లేని గుడ్డి గాంధారి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని టిడిపి, జనసేన నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రాలో రోడ్ల దుస్థితి పై తెలుగుదేశం జనసేన నాయకులు "గుంతల ఆంధ్ర ప్రదేశ్.కుదారేది?" కార్యక్రమాన్నిచేపట్టి తమ నిరసనవ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం పామర్రు రోడ్డులో గల గోతుల వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెండు పార్టీల నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్.పేరు చెప్పి పొరుగు రాష్ట్రాల నాయకులు, ప్రజలు హేళన చేసే స్థితికి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని దిగజారని విమర్శించారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా రోడ్లపై గుంతలు కూడాపూడ్చలేనిపరిస్థితులు ఈ ప్రభుత్వంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్ల కుమార్ రాజా (టిడిపి నియోజకవర్గ కన్వీనర్), తాడిశెట్టి నరేష్ (జనసేన నియోజకవర్గ కన్వీనర్), టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాస్, తాతినేని పూర్ణచంద్రరావు, మోటూరు వెంకటసుబ్బయ్య, వెంపటిగోపాలకృష్ణ, గుత్తికొండ పద్మ తదితర దేశం నాయకులతోపాటు జనసేన పార్టీ కూచిపూడి, పెదపూడి తదితరు ప్రాంతాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : విద్యార్థులకు అందించవలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని వెనిగండ్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ కాలేజీలు పరీక్షలు నిర్వహించకుండా, విద్యాసంవత్సరం పూర్తిచేసుకున్నవారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. కొత్తగా విద్యార్థి, తల్లి జాయింట్ అక్కౌంటు మెలికతో, ఫీజులు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన అంటూ పేర్లు పెట్టి, ప్రచారం చేసుకోవడం తప్పా చేసింది ఏమిలేదన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్, పాత బకాయిలు,చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, సురేంద్ర, సూరిబాబు, అనంత్, పాపారావు, వంశీ, ఇషాక్, సాయి, శ్రీరామ్, నితిష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చల్లపల్లి : కరువు నివారణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ తలపెట్టిన 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీలలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ దీక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 440 మండలాల్లో కరువు తాండవిస్తుంటే-ప్రభుత్వం కేవలం 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందని విమర్శించారు. సమగ్ర సర్వే చేయించి కేంద్రానికి నివేదించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తరతరాల చరిత్ర కలిగిన కృష్ణాజిల్లాలో నేడు తగినంత నీటి సరఫరా లేక ప్రజలు కరువుతో విలవిలలాడుతూ వలసలు పోతున్నారని తెలిపారు. వలసల నివారణకు తక్షణం ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కరువు బారిన పడకుండా ఉండేందుకు నికర జలాల సాధనే లక్ష్యంగా భావితరాల భవిష్యత్తుకై చేయి చేయికలుపుదాం, నీటిని సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగే దీక్షకు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ వక్కలగడ్డ గ్రామ శాఖ కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు లంకా నాగమల్లి, పార్టీ నాయకులు సిధాబత్తుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజలాల పునఃపంపిణీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : కృష్ణాజలాల పునఃపంపిణీ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20, 21తేదీలలో విజయవాడ ధర్నా చౌక్‌లో 30 గంటల నిరసన దీక్షలను విజయవంతం చేయాలని సీపీఐ గుడివాడ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో శనివారం 30 గంటల నిరసన దీక్షల పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర భవిత కోసం సీపీఐ చేస్తున్న పోరాటాలకు ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలన్నారు. 440 మండలలో కరువు తాడవిస్తుంటే ప్రభుత్వం కేవలం 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర సర్వేను నిర్వహించి కరువు నివారణ సహాయక చర్యలు చెపట్టాలన్నారు. ఈ కార్యాక్రమంలో సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, రైతు నాయకుడు గూడిపూడి బాబురావు, ఏఐటీయూసీ నాయకులు దుంపల వెంకటనరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు చట్టాలపై అవగాహనుండాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : గిరిజనులకు హక్కులు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా వారి ఆధ్వర్యంలో స్థానిక చింతగుంటపాలెం వద్దగల గిరిజన కాలనీ నందు న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి కె.వి రామకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సహాయాన్ని గిరిజనులంతా అందిపుచ్చుకోవాలని కోరారు. గిరిజనులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా సామాజిక ఆర్థికపరమైన న్యాయాన్ని పొందగలుగుతారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి శ్రీ ఫణి ధూర్జటి మాట్లాడుతూ గిరిజనులంతా విద్యాపరంగా ఆర్థికపరంగా పురోగతి సాధించాలని, మధ్యలో చదువు మానేసిన గిరిజనులకు సంక్షేమ శాఖ విద్య కొనసాగింపు కు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడ్వకేట్ ముసలయ్య ఉచిత న్యాయ సహాయాన్ని అందించే విధానాలను తెలియజేశారు. ఈ సమావేశంలో స్థానిక ఏఎస్ఐ కోటేశ్వరరావు, పి శివకుమార్, సచివాలయ సెక్రటరీలు న్యాయ సేవాధికార సంస్థ,గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు విముక్తి కావాలి - రావి

విశాలాంధ్ర-గుడివాడ : మన దేశానికి బ్రిటన్ నుండి స్వాతంత్రం సాధించినట్టే, బటన్ నొక్కుడు ప్రభుత్వం నుండి మన రాష్ట్రనికి విముక్తి కాలగాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని వలివర్తిపాడు వెళ్ళే రాహదారి వద్ద గుంతల ఆంధ్రప్రదేశకు దారేది అనే జనసేన, టిడిపిల ఉమ్మడి సారధ్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మజ్జి శ్రీనివాసరావు, సాయిన రాజేషలతో కలసి మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరావు మాట్లాడుతూ 2015లో స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని ఇదే రోడ్డుకోసం ధర్నా చేయడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి మంత్రి, పదవిని పొంది కూడ ఈ రోడ్డును వెయలేదన్నారు. అధికారంలోకి విచ్చన కొడాలి 5వేల కోట్లు ప్రజాధానాన్ని లూటి చేశాడని విమర్శించారు. గుడివాడ నుండి కంకిపాడు వెళ్లే రోడ్లులో ఇప్పటికి యాక్సి డెంట్‌ల వల్ల 15 మంది చనిపోవడం జరిగిందన్నారు. ప్రజలను మోసం చేసేందుకు జగన్ సర్కార్ వచ్చే ఎన్నికల్లో ప్రజలు సత్తా ఏమిటి చూపిస్తారని హెచ్చారించారు. ఈ కార్యాక్రమంలో టిడిపి పట్టణ, రూరల్ మండలం అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, సర్పంచ్ కకారల సురేష్, జనసేన, టిడిపి నాయకలు పోలాసి ఉమా, యార్లగడ్డ సుధారాణి, గోర్ల శ్రీలక్ష్మీ, కొల్లి రమ్య, పొట్లూరి రమాదేవి, ఇమ్మడిశెట్టి భాను, రేమల్లి రజనీకాంత్, అర్నేపల్లి పాండు, షేక్ జానీషరీఫ్, సర్కార్, సమ్మెట బ్రహాజీ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోళ్లు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొండేటి ఇందిర అధ్యక్షతన సాగిన ఈ సభలో పెదముత్తేవి ఎంపిటిసి ఉప్పలపాటిజ్యోతి మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో కొనుగోలు చేసే ధాన్యం విషయంలో రైతులను ఏ విధంగాను ఇబ్బంది పెట్టరాదని, పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత ఏడాదిఅన్ని వర్గాల రైతులు, కౌలు రైతులు పడిన ఇబ్బందులను ఆమె సభ దృష్టికి తెచ్చి ఈ ఏడాది దానికి భిన్నంగా వ్యవహరించి రైతులను ఆదుకోవాలనికోరారు. గ్రామాలలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయినా, విరిగిపోయినా అధికారులు పట్టించుకోవడంలేదని సభ దృష్టికి ఎన్ని సార్లు తెచ్చినా నిరుపయోగంగానే ఉందని ఆమెతోపాటు అయ్యంకి సర్పంచ్ నాగనబోయిన సునీల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేయగా పది రోజుల్లో స్తంభాలు వేసే అవకాశం ఉంటుందని ఏఈ రమేష్ బాబు తెలిపారు. అలాగే మంత్రిపాలెం ఎంపీటీసీ కాకుమాను శ్రీలక్ష్మి రహదారుల ప్రస్తుత దుస్థితి నీ పరిశీలించిస్పందించి సత్వరం అభివృద్ధి పరచాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ తో పాటు జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎండిఓ జి సుధాప్రవీణ్, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పాల్గొనగా ఏజెండా అంశాలను ఆయా శాఖల అధికారులుసభలో చర్చించారు.

తాలుకా పోలీసుస్టేషన్ తనిఖీలు చేసిన ఏలూరు రేంజ్ డీఐజీ

విశాలాంధ్ర-గుడివాడ : వార్షిక తనిఖీలలో భాగంగా గుడివాడ సబ్ డివిజన్లోని గుడ్లవల్లేరు, గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ శనివారం డి.ఐ.జి అశోక్ కుమార్ గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించి అనంతరం గుడివాడలోని తాలూకా పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ గుడివాడలో పెద్దగా నేర చరిత్ర కనిపించలేదన్నారు. మోటూరు లాంటి కొన్ని సమస్యాత్మక గ్రామాలలో ఎటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. గుడివాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన జగనన్న కాలనీలో ప్రజలు నివాసం ఉంటున్నారని, అక్కడ ఎటువంటి అసాంఘిక చర్యలు, గొడవలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గుడివాడతోపాటు పరిసర ప్రాంతాలలో గంజాయి, గుట్కా అమ్మకాలు పెద్దగా లేవని, ఈ ఏడాది రెండు కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో గంజాయి అమ్మకం దారులపై ఎన్నో కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఎస్.పి జాషువా, గుడివాడ ఇన్‌చార్జి డి.ఎస్.పి జయసూర్య, తాలూకా స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరణా అధికారులకు శిక్షణ

విశాలాంధ్ర-ఘంటసాల : ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఘంటసాలలో కృషి విజ్ఞాన కేంద్రం నందు ఘంటశాల, చల్లపల్లి మండలాల రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యోగులైన గ్రామ వ్యవసాయ సహాయకులకు మినుము పంటలో వచ్చే ప్రధానమైన పురుగులు, తెగుళ్ళు, వాటి యాజమాన్య పద్ధతులను గురించి కెవికె సస్యరక్షణ శాస్త్రవేత్త శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మినుము పంటను ఆశించే వివిధ రసం పీల్చు పురుగులు అయినటు వంటి తెల్ల దోమ, పేను బంక, తామర పురుగులు, మారుకా మచ్చల పురుగు, పొగాకు లద్దె పురుగు, ఆకు మచ్చ, బూడిద మరియు కాండం గజ్జి తెగులు గురించి, వాటి గుర్తింపు లక్షణములు, వాటి సమగ్ర యాజమాన్య చర్యలను గురించి సస్యరక్షణ శాస్త్రవేత్త డా. కె. రేవతి తెలియచేశారు. ఈ కార్యక్రమములో కెవికె శాస్త్రవేత్తలు డా. వెంకట లక్ష్మి, డా. నవీన్, కృష్ణవేణి, ఘంటశాల, చల్లపల్లి మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఫత్తేలంకలో రోటరీ వైద్య శిబిరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని ఫత్తేలంక (బొడ్డంకి) గ్రామంలో కె.సి.పి.మరియు రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు ఉయ్యూరు వారి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం జరిగింది.ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్, దంత వైద్య శిబిరాన్ని డా,,రవి కుమార్, ఎల్.అనిత లు 115 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ సిహెచ్.నాగ సుబ్రహ్మణ్యం కె.సి.పి.డిప్యూటీ మేనేజర్ శ్రీరామచంద్ర రావు (వీరంకిలాకు) గ్రామస్తులు జాకిర్ షరీఫ్ సయ్యద్ మహబూబ్ కె.సి.పి.సిబ్బంది పాల్గొన్నారు.

గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారి చూపండి

విశాలాంధ్ర-కృత్తివెన్ను : గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారి చూపండంటూ తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులు కలిసి మండలంలోని పాచ్చపురం గ్రామంలో రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. శనివారం జరిగిన ఈ నిరసన ర్యాలీలో ఇరుపార్టీల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరును తీవ్రస్థాయిలో విమర్శించారు. కనీసం మోటార్ సైకిల్ వెళ్లడానికి వీలు లేకుండా రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని విమర్శించారు. ప్రజలకు కనీసం మంచి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయలేని చేతకాని ప్రభుత్వం అధికారంలో ఉందని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలు మానేసి ప్రజల అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ పెడన ఇన్చార్జి కాగిత కృష్ణ ప్రసాద్, జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకాల సురేష్, కూనసాని చిన్న, పాశం నాగమల్లేశ్వరరావు, జొన్నలగడ్డ కొండ, రేవు గోపాలకృష్ణ లతోపాటు పార్టీ ఇరు పార్టీ శ్రేణులు ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : కళాశాలలో చదువుకుంటున్న తమ పిల్లల నడవడిక, చదువు తదితర అంశాలపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఆరా తీసుకొని శ్రద్ధ వహించి వారి ఉన్నతికి కృషి చేయాలని మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు (ఎఫ్ ఎ. సి) డి.సుధాకర్ సూచించారు. కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరొక నాలుగు నెలల్లో నిర్వహించే వార్షిక పరీక్షలకు ప్రిపేర్ చేయించడానికి పిల్లలను సిద్ధం చేసే విషయంలో తమకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలలో గత విద్యా సంవత్సరంలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచామని అదే విధంగా ఈ ఏడాది కూడా దానిని అధిగమించే స్థాయికి చేరాలంటే అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల కృషి, భాగస్వామ్యం కూడా ఉండాలని వివరించారు. చదువు పట్ల ఆసక్తి పెంచే విధంగా ఇంటి వద్ద హితబోధచేస్తూ సకాలంలో కాలేజీకి వస్తున్నాడా? రావటం లేదా? అన్న విషయాలు కూడా ఎప్పటికప్పుడు గమనించాలనిసూచించారు. ఈ సమావేశంలో అధ్యాపకులతో పాటు పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పాండురంగ ఉత్సవాలు ఏర్పాట్లు

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నంలో ఉన్నటు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంమైన శ్రీ పాండురంగ స్వామి ఉత్సవాలు నిమిత్తం ఏర్పాట్లును పరిశీలించిన నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వివిధ ప్రదేశాలు నుండి యాత్రికులు వస్తారు కావున మరుగుదొడ్లు, మంచినీటి కొరత లేకుండా చూసుకోమని ఆలయ కమిటీ సూచనలు చేయటమే కాకుండా ఏమైనా అవసరం ఉన్న యెడల ప్రతి సమస్యను తమ దృష్టి కి తీసుకుని రావాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో మేయర్ తో 5 వ డివిజన్ ఇంచార్జ్ వేముల వనబాబు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొవ్వ ఎలక్ట్రికల్ ఏఈగా రమేష్ బాబు

విశాలాంధ్ర-కూచిపూడి : మువ్వ మండల విద్యుత్.శాఖ అసిస్టెంట్ ఇంజనీరుగా ఏ. ఎన్.వి. వి. రమేష్ బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఈగా పనిచేసిన పీవీ శివ నారాయణ గుణదల కార్యాలయానికిబదిలీ అయిన గతసంవత్సరన్నర కాలంగా ఖాళీగా ఉన్న ఆ పోస్టును ఎట్టకేలకు భర్తీ చేశారు. రమేష్.ను మచిలీపట్నం రూరల్ మండలం నుంచి బదిలీ చేశారు. రమేష్ గతంలో 2008 ప్రాంతంలో పనిచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను కలిసి పుష్ప గుచ్చాలతో అభినందించారు.

ఘంటసాల పీఏసీఎస్ మాజీ చైర్మన్ దోనేపూడి మృతి

విశాలాంధ్ర-ఘంటసాల : ఘంటసాల పీఏసీఏస్ మాజీ చైర్పర్సన్ దోనేపూడి వీర రాఘవేంద్రరావు (పీసుబాబు) (68) శనివారం సాయంత్రం మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వేమూరి పట్టాభి మేనల్లుడు పీసుబాబు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఘంటసాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పీసుబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ప్రజల సందర్శనార్థం పీసుబాబు మృతదేహాన్ని ఆయన ఇంటి వద్ద ఉంచారు. పీసుబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పీసుబాబు అంత్యక్రియలు ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేత్ర పరీక్షా శిబిరం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి లయన్సబ్ విఆర్ కె నగర్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ మల్టీపర్పస్సర్వీస్ సెంటర్లో శనివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం జరిగింది. మండవ మనోజ్ చౌదరి, భానుజ, లషిక చౌదరి, దొప్పలపూడి హవీష్ ఆర్థిక సహకారంతో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ వెంకటరావు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందిని ఐఓఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపాటి రాధాకృష్ణ, నర్రా సాయిబాబు, ఎంవి. కృష్ణారావులు శిబిరాన్ని పర్యవేక్షించారు. కోడూరు క్లబ్ అధ్యక్షులు పి.సాయిబాబు శిబిరాన్ని సందర్శించారు.

మహాత్ములను గౌరవిద్దాం

విశాలాంధ్ర-మచిలీపట్నం : పట్టాభి సీతారామయ్య లాంటి మహాత్ములను, మహనీయులను గౌరవించుకోవలసిన ధర్మం మనపై ఉన్నదని కార్పొరేటర్ చిత్తజల్లు రాము అన్నారు. శనివారం ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడికి గౌరవం ఇవ్వలేని మచిలీపట్నం నగర కార్పొరేషన్ పాలకులకు పరిపాలించే అర్హత ఉందా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈనెల 24న జరిగే మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో పట్టాభి స్మారక భవనం అంశాన్ని ఎజెండాలో పాలకులు చేర్చనందున టేబుల్ ఎజెండాగా ఆమోదించి అనుమతులు ఇప్పించాలి ఆయన కోరారు. ఈనెల 24 నస్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి నాడు మచిలీపట్నం నగరపాలక సమస్త కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ఆ మహనీయుని స్మారక భవన నిర్మాణ అంశాన్ని ఎజెండాలో పెట్టకపోవడాన్ని తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, తీవ్రంగా ఖండించారు ఈ సమావేశంలో అన్నం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకు పోర్టులతో అధిక ఆదాయం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వేలకు సరుకు రవాణాలో అత్యధిక అదాయం పోర్టుల ద్వారానే లభిస్తుందని దానిని మరింత పెంచే విధంగా రైల్వే అధికారులు,పోర్టు అధికారులు సమన్వయంతో పని చేసి వ్యాపారఅభివృద్ధికి తోడ్పాటు అందించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎమ్) కె.రవీన్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం విజయవాడ పర్యటనలో భాగంగా డివిజనల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్(డిఆర్ఎం) నరేంద్ర ఎ పాటిల్ అధ్యక్షతన డివిజన్ పరిధిలోని పోర్టు అథారిటీల అధికారులందరితో బిజినెస్ డెవలప్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించారు. పిసిసిఎమ్ డివిజన్‌లోని లోడింగ్ ట్రెండ్‌లు, లక్ష్యాలు, సరుకుల వారీగా లోడింగ్ పనితీరును సమీక్షించారు. రాబోయే ఎఫ్‌వై 2024-25 కోసం సరుకుల వారీగా లోడింగ్ అంచనాలను డివిజన్ మీదుగా సరుకు రవాణా చేసే అన్ని ఓడరేవుల అధికారులతో చర్చించారు. ముందుగా డిఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్స రంలో డివిజన్ ఆదాయ అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పోర్ట్,అదానీ కృష్ణపట్నం, కాకినాడ సీ పోర్ట్, రామయ్యపట్నం పోర్టు,కాకినాడ గేట్‌వే పోర్ట్ లిమిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను తనిఖీలు, టిక్కెట్ చెకింగ్‌లు

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎమ్) కె.రవీన్ కుమార్ రెడ్డి సాయంత్రం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, వెయిటింగ్ హాల్స్, ఏటీవీఎం మెషీన్‌ల పని తీరును పరిశీలించారు.దాదాపు 44 మంది టిక్కెట్ చెకింగ్ సిబ్బంది,10 మంది ఆర్‌పిఎఫ్ సిబ్బందితో టిక్కెట్ తనిఖీలు నిర్వహించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

కలెక్టర్ ఢిల్లీరావుకు దోనేపూడి వినతి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావు కలిశారు. దోనేపూడి శంకర్‌తో పాటు కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, చుండురు సుబ్బారావు, మేకల డేవిడ్, యలమందరావు, లంక దుర్గారావు కొట్టు రమణ, లంక గోవిద్‌లతో కలిసి ఎన్టీఆర్ జిల్లాను కరువుజిల్లాగా ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి ఆహార పంటలకు రూ.50వేలు, ఉద్యానవన పంటలకు రూ.75 వేలు, వాణిజ్య పంటలకు రూ.1లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని, సాగుదారులైన కౌలురైతులను గుర్తించి పంటల నష్ట పరిహారం కౌలు రైతులకే ఇవ్వాలన్నారు. వేద్రాది, చింతలపూడి లాంటి చిన్న మధ్య తరహా ఎత్తిపోతల పథకాలను అన్నిటికీ నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలన్నారు. నిల్వ ఉన్న పంటలను కాపాడుకోవడానికి పగటిపూట 9గంటలు కరెంటు ఇవ్వాలన్నారు. రబీలో పంటలు వేసుకునే వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు కల్పించాలని, వ్యవసాయ పనులు లేని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి రోజుకి రూ.600 చొప్పున సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని తెలిపారు. జిల్లాలో 80శాతం మంది వ్యవసాయమే జీవనాధరం, ఎక్కువ మంది గ్రామీణ ప్రజలకు వ్యవసాయ మీదనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో (2023) జిల్లాలో సాధారణ వర్షపాతం 732.21 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా కేవలం 614.41 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైందన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నేలలో అసలు వర్షం పడలేదన్నారు. జిల్లా మొత్తంగా దాదాపు 14 మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా అతి తక్కువ వర్షపాత నమోదైందన్నారు. దీని వల్ల జిల్లా మొత్తంగా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని తెలియజేశారు. కానీ జిల్లాలో గంపలగూడెం, తిరువూరు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారని, వాటికన్నా అతి తక్కువ వర్షపాతం కురిసిన మండలాలను పరిగణలోకి తీసుకోకపోవడం చాలా బాధాకరం అన్నారు. జిల్లాలో ఎక్కువ ఆయకట్టు వర్షాధారం, చెరువులు కింద సాగు అవుతోందని, మరి కొంత నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద పంటలు పండిస్తున్నారని, ఈ ఏడాది నాగార్జున సాగర్ లో నీరు లేకపోవడంతో కిందకు నీరు విడుదల చేయలేదన్నారు. దీంతో కాలువల కింద ఉన్న ఆయకట్టు దాదాపు 2 లక్షల ఎకరాలు దెబ్బతిందని, చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని మధ్యలోనే వదిలేశారని, మున్నేరు పై ఆనకట్ట ఆధునీకరణకు నోచుకోలేదన్నారు. పలు ఎత్తిపోతల పథకాలు వట్టిపోయాయని, వరి పంట 1.50లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉందని, కేవలం లక్ష ఎకరాల్లోనే సాగయిందన్నారు. ఎ.కొండూరు మండలం గొల్లమందల గ్రామంలో వరి పంటకు నీరులేక ఎండిపోతున్న పంటను పశువులు మేత కోసం వదిలేసిన పరిస్థితి ఉందన్నారు. పత్తి పంట ఒక లక్ష ఎకరాల్లో సాగు చేశారని, దాదాపు 90శాతం పంట ఎండిపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో సీపీఐ జిల్లా పార్టీ, రైతు, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గంలోనే అనేక మండలాల్లోని కొన్ని గ్రామాల్లో పర్యటించామన్నారు. ఎండిపోతున్న పంటలను పరిశీలించామని, రైతులను అడిగి వివరాలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వరిపంటకు సుమారు కౌలుతో సహా రూ.35వేల నుంచి 40 వేలు పెట్టుబడి అయిందని, పత్తి పంటకు రూ.50 వేల నుంచి 60వేలు ఖర్చు పెట్టారని, మిరప పంటకు రూ.1లక్ష నుంచి రూ.1,50లక్షల వరకు అధిక వడ్డీలకు అప్పులు చేసి పంటలను పెట్టుబడి పెట్టారన్నారు. బోర్ల కింద సాగుచేసే పంటలను కాపాడుకోవడానికి పగటిపూట తొమ్మిది గంటలు కరెంటు కూడా రావడట లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలురైతులు పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, 40 వేల మందికి కౌలుగుర్తింపు కార్డులు జారీ చేసినట్లు గణాంకాలు చేబుతున్నాయని, ఏ ఒక్కరికి కూడా పంట రుణాలు అందలేదన్నారు. కరువు మండలాలుగా ప్రకటించి ఎండిపోయినా పంటలకు పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు కోరారు. జిల్లా మొత్తం కరువుగా ఉండటం వల్ల వ్యవసాయ పనులు తగ్గిపోవటంతో ఉపాధి హామీ పనులు కావాలని వ్యవసాయ కూలీలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.

10 నుంచి సంగీత నీరాజనం

కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి విద్యావతి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 10 నుండి 12వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించనున్న కృష్ణవేణి సంగీత నీరాజనాన్ని ఘనంగా నిర్వహించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలనని కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి వీ.విద్యావతి కోరారు. విజయవాడలో నిర్వహించనున్న కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లుపై విద్యావతి శనివారం నగరంలోని హోటల్ వివంతలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి రజిత్ భార్గవ్, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, సబ్ కలెక్టర్ అదితి సింగ్, మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావతి మాట్లాడుతూ సాంస్కృతి, సాంప్రదాయాలలో తెలుగు భాష గొప్పతనాన్ని, వారసత్వాన్ని వెలుగులోకి తీసుకువచ్చేందుకు పురాతన కళలైన హరికథ, నామసంకీర్తనలపై ప్రజల దృష్టిని పునరుద్ధరించేందుకు కృష్ణవేణి సంగీత నీరాజనాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విజయవాడలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో నిష్ణాతులైన సంగీత విద్వాంసులు, కళాకారులచే కర్నాటక సంగీత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 700 సీట్ల సామర్థ్యమున్న తుమ్మలపల్లి కళాక్షేత్రం సంగీత నీరాజనం కార్యక్రమానికి అనువుగా ఉంటుందన్నారు. కృష్ణానది తీరాన ఉన్న బెరంపార్కు, దుర్గాఘాట్‌లో నిర్వహించే కార్యక్రమాలు కనువిందు చేస్తాయన్నారు. సంగీత నీరాజనానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యావతి కనకదుర్గమ్మను దర్శించుకుని, అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రం, బెరంపార్కు, దుర్గఘాట్ పరిశీలించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

మైలవరం నియోజకవర్గంలో సీపీఐ భూపోరాట ఉద్యమం ద్వారా ఆవిర్భవించిన పోరాటనగర్ 33వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామాన్ని అరుణపతాకాలతో అలంకరిస్తున్న పార్టీ శ్రేణులు.

30 గంటలు నిరసన దీక్ష జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : కరువు నివారణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీలలో విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన 30 గంటల నిరసన దీక్షలో అందరూ పాల్గొనాలని, నిరసన దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి వల్లంకొండ బ్రాహ్మం పిలుపునిచ్చారు. పెనుగంచిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో శనివారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబోజి శివాజీ, మండల కార్యదర్శి కనకపూడి బాబురావు, చాగంటి రామకృష్ణ, జక్కులురి వెంకటేశ్వర్లు, కటారపు కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

27, 28వ తేదీల్లో నిరాహార దీక్షలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనెల 27, 28వ తేదీల్లో వేలాది మందితో రైతులు కార్మికులతో జరిగే రెండు రోజుల పాటు జరిగే నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని కార్మిక రైతు సంఘాల సమన్వయ సమితి ప్రచార కమిటీ కన్వీనర్లు ఎస్.వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య తెలిపారు.

శనివారం విజయవాడలోని ఎంబీ భవన్‌ల కార్మిక రైతు సంఘాల సమన్వయ సమితి ప్రచార కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 27, 28తేదీల్లో జరిగే రైతులు కార్మికుల నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని చెప్పారు. విజయవాడ నగరంలో 25 కూడలిలో పెద్ద హోల్డింగ్‌లు దాదాపు 1000 స్తంభాలకు బ్యానర్లు, ఆటోల ద్వారా మైక్ ప్రచారము, స్టిక్కర్ల ద్వారా ఆటోలతో ప్రచారము, సినిమా హాల్లోలో ద్వారా ప్రచారం చేయాలని తీర్మానించారు. మోడీ అవలంభిస్తున్న రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జరుగుతున్న ఈ ఉద్యమంకు పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. మొత్తం కార్మిక వర్గాన్ని రైతాంగాన్ని సమీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, రామకృష్ణ, దుర్గారావు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ సంరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : బాలల రక్షణ సంరక్షణ సమాజం లోని ప్రతి ఒక్కరి బాధ్యత అని దిశ పోలీస్ స్టేషన్ సిఐ వాసవి తెలిపారు. మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాలకు యువత, బాలలు దూరంగా ఉండాలని, బాలలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలన్నారు. శనివారం భవానిపురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో బాలల హక్కుల పరిరక్షణ-అవగాహన చైతన్య వారోత్సవాలలో భాగంగా 5వ రోజు బాలలకు అవగహహన-చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన సిఐ మాట్లాడుతూ యువత దేశ సంపద ప్రతి ఒక్కరూ ఏదో ఒక లక్ష్యం పెట్టుకుని దాన్ని సాధించటానికి నిరంతరం సాధన చేయాలన్నారు. ప్రభుత్వ బాలుర వసతగృహం సూపరిండెంట్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాలల హక్కుల వారోత్సవాలను అందరి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్ మాట్లాడుతూ బాలలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటే.ప్రకాష్ కుమార్,యాక్షన్ ఎయిడ్ జిల్లా ప్రతినిధి రవీంద్ర,హెూమ్ ఇంటెక్ ప్రొఫెషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్,తదితరులు ఆల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికై 30 గంటల నిరసన

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి 20వ 21వ తేదీలలో 30 గంటల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ 49 మరియు 50 డివిజన్‌ల డివిజన్ కమిటీల విడివిడిగా జరిగిన సమావేశాలలో నగర కార్యదర్శి జి కోటేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని, కృష్ణ జలాల పంపిణీకై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటనే తగుచర్యలు తీసుకోవాలని, కొండ ప్రాంతాలలో అభివృద్ధి చేయాలని, సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 20,21 తేదీలలో విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన 30 గంటల నిరసన దీక్షలో అందరూ పాల్గొనాలని, అలాగే ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు వివరాలు తెలుసుకొని, 30గంటల నిరసన కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసి జయప్రదం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. నగర కార్యవర్గ సభ్యులు తాడి పైడయ్య మాట్లాడుతూ మన ప్రాంతంలో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తూ, మనకి ఎన్ని ఇబ్బందులు ఉన్నా, తీవ్రమైన ప్రజా సమస్యల కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. 49వ డివిజన్ కమిటీ సమావేశం వినుకొండ శాంసన్ అధ్యక్షతన జరగగా, డివిజన్ కార్యదర్శి బోరా రామకృష్ణ సభ్యులు తిప్పాబత్తుల వెంకటేశ్వరరావు, సీరం రవి, గువ్వలగట్టు రాంబాబు, ఇప్పిల రంగారావు, కోరంగి చిన్నారావులు, 50వ డివిజన్ కమిటీ సమావేశం నడకుదుటి సూర్యనారాయణ రాజు అధ్యక్షతన జరగగా, సభ్యులు పిట్ట అప్పారావు, మోకా దుర్గారావు, టంగుటూరి దనంజకుమర్, గుతుత్తి రామకృష్ణ, సమ్మిటి విష్ణు, మారెడుపూడి కనకరావు, రావాడ దేవుడమ్మ లు పాల్గొన్నారు.

వైసీపీ అహంకార చర్యలు మానుకోవాలి

విశాలాంధ్ర-ఎ కొండూరు : వైసిపి నాయకులు తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది అని అహంకార చర్యలకు పాల్పడుతున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు ను బెదిరిస్తున్నారని వారు అహంకార చర్యలను మానుకోవాలని టిడిపి జనసేన నాయకులు హెచ్చరించారు శనివారం మండలంలోని కంభంపాడు గ్రామంలో టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు శాంతి ర్యాలీని నిర్వహించారు ఈ సందర్భంగా తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శావల దేవదత్ జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తిరువూరునియోజకవర్గ సమన్వయ కర్త అయిన మనుబోలు శ్రీనివాసరావు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమనేని శ్రీనివాసరావు లు టిడిపి జనసేన కార్యకర్తలతో కలిసి కంభంపాడులో శాంతి ర్యాలీ అనంతరం మాట్లాడుతూ కంభంపాడులో వైసిపి నాయకులు అహంకారపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలను బ్యానర్లను జండాలను చించి వేస్తున్నారని ఇది అనాగరిక చర్యని అన్నారు ఇటీవల తిరువూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటు సందర్భంగా విజయవాడ నుండి వస్తున్న టిడిపి నాయకులకు స్వాగత ఫ్లెక్సీ బ్యానర్లను రాత్రికి రాత్రి చించి వేశారని అంతేకాకుండా బ్యానర్లు కట్టే వారిని కూడా బెదిరిస్తున్నారని అన్నారు. కంభంపాడులో టిడిపి జనసేన నిర్వహిస్తున్న శాంతి ర్యాలీకి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు అనంతరం వీరు విస్సన్నపేట ఏ కొండూరు రోడ్డుపై కుమ్మరి కుంట సమీపాన కూలి పై ఉన్న ఏడు కానాల వంతెనను పరిశీలించి అక్కడ వైసిపి పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు వైసీపీ పాలనలో ఆంధ్ర రాష్ట్రంలో ఏ గ్రామానికి సక్రమంగా దారులు లేవని ఈ సందర్భంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు బెజవాడ శంకర్ బాణావత్ భీమా నాయక్ బరోతు పిక్ల నాయక్ బలుమూరి నాగ పద్మ ఎమ్ సాయి చంద్రు నాయక్ రాజేష్ ఖన్నా మోర్ల తిరుపతిరావు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

విశాలాంధ్ర-నందిగామ: తెలంగాణ-ఆంధ్రాలో మోస్ట్ వాంటెడ్ దొంగ సయ్యద్ అల్తాఫ్ అలియాస్ అప్పును అంతరాష్ట్ర దొంగ నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.20 లక్షల విలువ చేసే బంగారం వెండి శనివారం స్వాధీనం చేసుకున్నారు. సయ్యద్ అల్తాఫ్ అలియాస్ అప్పు చీరాల పట్టణానికి చెందిన వ్యక్తి ప్రస్తుతం కోదాడలో నివాసం ఉంటున్నాడు ఇతనిపై ఇప్పటికే 70 దొంగతనం కేసులు ఉన్నాయి. తాళాలు వేసిన ఇళ్లను గమనించి ఒక్కడే వచ్చి దొంగతనం ఇతని నైజం. ఇతనికి సాయం చేసే మరో దొంగ కంచికచర్ల చెందిన మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. నందిగామ విజయవాడ జగ్గయ్యపేట, కోదాడ పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు చేశాడు. ఈ సందర్భంగా ఏసిపి జనార్దన్ నాయుడు మాట్లాడుతూ నందిగామలో కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరగడంతో కమిషనర్ క్రాంతి రాణా టాటా ఆదేశాల మేరకు డీసీపీ అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో సీఐ హనీష్ కుమార్ వారి సిబ్బందితో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేసి టెక్నికల్ ఆధారాల ద్వారా దొంగను కొద్ది రోజులలోనే చకచక్యంగా పట్టుకున్నాము. సయ్యద్ అల్తాఫ్ అనే దొంగ పగటి పూట మోటార్ బైక్ పై రెక్కీ చేసి రాత్రిపూట కారులో వచ్చి దొంగతనాలు చేస్తూ ఉంటాడు 13 కేసులలో చోరీ కాబడిన సుమారు 156 గ్రాముల బంగారం, 8.820 గ్రాముల వెండి ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన కారు, బైకులను మరియు రూ.40 వేలు నగదు మొత్తం సుమారు రూ. 20 లక్షల విలువైన చోరి సొత్తును స్వాదీనం చేసుకుని అరెస్ట్ చేశారని ఏసీపీ తెలిపారు. గుంటూరు, కోదాడ, ఖమ్మం కాకినాడ ఎన్.టి.ఆర్ జిల్లాలలో పోలీస్ వారు పలుమార్లు అరెస్ట్ చేసి జైలుకు పంపడం జరిగింది. ఇతనిపై సుమారు 70 వరకు దొంగతనాలు చేసినాడు. జైలుకు వెళ్లి వచ్చిన తరువాత కూడా తన ప్రవృత్తిని మార్చుకోకుండా పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్ళను ఎంచుకుని రాత్రి సమయంలో తాళాలు పగలుగొట్టి ఇంటిలోనికి వెళ్లి దొంగతనం చేసేవాడు.నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు దొంగతనాలు జగ్గయ్యపేట పరిధిలో ఒక దొంగతనం వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం కంచికచర్ల పోలీస్ స్టేషన్ ఒక దొంగతనం ఇబ్రహీంపట్నం నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఖమ్మం మూడో పోలీస్ స్టేషన్ లో ఒక దొంగతనం కొత్తగా 13 కేసులు నమోదయాయని ఏసీపి తెలిపారు.

ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కార్యాల యంలో సహాయ ప్రాంతీయ సంచాలకులు (అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్) గా పనిచేస్తున్న డాక్టర్ ప్రసాద్ బాబుకు డెప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఇగ్నో కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సైకాలజీ రంగంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ మనస్తత్వ విశ్లేషకుడు, రచయిత, ఉపన్యాసకుడిగా ప్రసిద్ధి పొందిన ప్రసాద్ బాబు మానవ మనస్తత్వంపై 53 పుస్తకాలు రచించారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 50కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. సైకాలజీ, ఎడ్యుకేషన్ రంగాల్లో ఆయన రాసిన 200కు పైగా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ప్రసాద్ బాబు పరిశోధన మార్గదర్శకత్వంలో ఇప్పటికి ఆరుగురు ఎం.ఫిల్, ఒకరు పిహెచ్.డి పట్టాలు అందుకున్నారు. ఇంటర్, డిగ్రీ, బిఇడి కోర్సులకు సంబంధించి వివిధ యూనివర్శిటీల్లో కరికులం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. డిఎస్సి వంటి పలు పోటీ పరీక్షలకు ఆయన రాసిన పుస్తకాలను తెలుగు అకాడమి ప్రచురించింది. ఆకాశవాణి, దూరదర్శన్ ల ద్వారా వివిధ అంశాలపై ప్రసంగాలు, ఫోన్ ఇన్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద్ బాబుకు పదోన్నతి లభించటం పట్ల ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్, సైకాలజ విభాగ సిబ్బంది, నగరానికి చెందిన పలువురు సైకాలజిస్ట్ లు, కె.బి.ఎన్. కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, తెలుగు అకాడమి పాలకమండలి సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఆయనకు అభినందనలు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ - యువకుడి మృతి

విశాలాంధ్ర-వత్సవాయి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి చెందిన ఘటన మండలంలోని ముక్కపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మక్కపేట గ్రామానికి చెందిన గుదేటి జయప్రకాష్ (19) శుక్రవారం రాత్రి చిట్యాల గ్రామం నుండి మక్కపేట వస్తూ ఉండగా జగజ్జీవన్ విగ్రహం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ జయప్రకాష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న యువకుడు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా స్థానిక ఎస్ఐ అభిమన్యు తెలిపారు.

మాదకద్రవ్యాల పై అవగాహన

విశాలాంధ్ర-గంపలగూడెం : పెనుగొలను శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవల్లో భాగంగా శనివారం మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడమైనది. తదుపరి విద్యార్థిని, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో గంపలగూడెం పోలీస్ ఏఎస్ఐ దేవర. వెంకటేశ్వర్లు, తిరువూరు నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ వేములు. నాగేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవి. నరసింహారావు, విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు మరియు గ్రంథాలయ నిర్వాహకురాలు జై. శ్రీలత పాల్గొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయం నందు మెయిన్ పాఠశాల విద్యార్థులకు పరుగు పందాలు, మ్యూజిక్ చైర్స్, ముగ్గుల పోటీలు, పుస్తక ప్రదర్శన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ సంజీవరెడ్డి, జానకి, విశ్రాంత ఉపాధ్యాయులు వై. క్రాంతి కుమార్, గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు మరియు పాఠకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ, అభివృద్ధే లక్ష్యంగా...

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రాక్టీస్ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసినట్లు, ఎన్నికైన సొసైటీ ప్రెసిడెంట్ బొలిశెట్టి గౌరి మణి తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ప్రాక్టీస్ న్యాయవాదుల సమావేశం నిర్వహించి నూతనంగా ప్రాక్టీస్ అడ్వకెట్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షురాలుగా పిఠాపురం బార్ సభ్యురాలు బొలిశెట్టి గౌరిమణి, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం న్యాయవాది జనరల్ సెక్రటరీ బంటుమల్లి కృష్ణ,కాకినాడ బార్ సభ్యులు విడియాల శివ ప్రసాద్ ట్రెజరర్, ప్రకాశం జిల్లా, మార్కాపురం బార్ సభ్యుడు దొడ్డా సత్యనారాయణ రెడ్డి ఆర్గనైజర్ సెక్రటరీ, కాకినాడ జిల్లా న్యాయవాది జి.అమృతవల్లి వైస్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవముగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి న్యాయవాదులు పాల్గొన్నారు.

జగజ్జీవన్‌రామ్ విగ్రహం కుడా ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : భారతదేశ రాజ్యాంగ ఆమోద దినోత్సవం నవంబర్ 26 సందర్భముగా సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున మాల మాదిగలను రెండు కళ్ళుగా భావించి స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ విగ్రహం ప్రక్కనే బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం పెట్టించేలా ముఖ్యమంత్రి వై.యస్.జగన్ దృష్టికి తీసుకెళ్ళి తక్షణం ప్రకటించే విధంగా కృషి చేయాలని ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం గాంధీనగర్‌లో ఉన్న బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఈనెల 30న ఛలో జింఖానా గ్రౌండ్ మాదిగల యుద్ధభేరి మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ ఇద్దరి విగ్రహాలు ప్రక్క ప్రక్కనే పెట్టాలనే డిమాండ్‌ను ముఖ్యమంత్రి, అన్ని శాఖ మంత్రులు, యం.యల్.ఎ.లు ఉమ్మడి 13 జిల్లాల కలెక్టర్లకి గత 7 నెలల క్రితమే వినతి పత్రాలు ఇచ్చామని, ముఖ్యంగా సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జునకి వినతి పత్రం అందజేస్తే కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలిసి మౌనంగా వుంటే రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆలేటి ఏసుపాదం, యం.ఆర్.పి.యస్. కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్ యాత్ర కాదు-నయవంచన యాత్ర

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర ప్రభుత్వ ప్రజా ప్రతినిధులంతా ఒక బస్ యాత్ర చేస్తున్నారు,అది నయవంచన యాత్ర అని జై భీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,హైకోర్టు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ ఎద్దేవ చేశారు శనివారం గాంధీనగర్‌లోని రామాపంక్షన్ హాల్‌లో వైసీపీ సామాజిక సాధికార దగా యాత్ర కు నిరసనగా జై భీమ్ రావు భారత్ పార్టీ మేధోమధన సదస్సు నిర్వహించారు.దీనికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.ముందుగా కొవ్వూరులో జరిగిన సంఘటన అత్యంత దారుణం పోలీసుల అక్రమ నిర్బంధ కారణంగా ప్రాణాలు కోల్పోయిన దళిత సోదరునికి ఈ సభ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శ్రవణ్ కుమార్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ 2022 నుంచి ఈ ప్రభుత్వం వైఖరిని తాము అధ్యయనం చేస్తున్నాము ఇప్పుడు సాధికార యాత్ర నిన్న, మొన్న మొదలు పెట్టారు అయితే జై భీమ్ రావు భారత్ పార్టీ ఎప్పటి నుండో సమాచార హక్కు చట్టం ద్వారా ఈ ప్రభుత్వ తీరు పై నివేదికలు తీసుకుంటుంద న్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిది పిల్లి మాణిక్యాలరావు, యూని యన్ ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బషీర్ అహ్మద్,జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు చెవుల కృష్ణ అంజనేయులు, పరసా సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ ఇన్ లవ్ నవల ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : డాక్టర్ రామోజు శ్రీధర్(విశ్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్, ఎపి కాలేజిఏట్ ఎడ్యుకేషన్) రచించిన డాక్టర్ ఇన్ లవ్ నవల శనివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో ఆవిష్కరిం చారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపి ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు అంబటి మధుమోహ నకృష్ణ నవలను ఆవిష్కరించారు. సభాధ్యక్షునిగా శారదా కళా సమితి అధ్యక్షులు, హను మంతరాయ గ్రంథాలయం కమిటీ అధ్యక్షులు డోగిపర్తి శంకరరావు వ్యవహరించారు. గౌరవ అతిథిగా పొట్లూరి సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావి శారద గ్రంథ సమీక్ష చేశారు. రామోజు మోహన(వాకర్స్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్) జ్యోతి ప్రజ్వలన చేయగా సభా నిర్వహణ సమితి కన్వీనర్ ఎం ఆర్ ఎస్ ప్రకాశరావు చేశారు. అతిథులు మాట్లాడుతూ రచయిత విషయగ్రాహ్యత, ప్రతిభావ్యుత్పత్తులు ఈ నవలలో ప్రస్ఫుటంగా గోచరిస్తాయని అన్నారు.

పునాదిపాడులో వివాహిత ఆత్మహత్య.

విశాలాంధ్ర-ఉయ్యూరు: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ వివాహిత, అత్తింటి వేధింపులతో ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన కంకిపాడు మండలం పునాదిపాడు లో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే మంచాల జ్యోతి (23), 6 సంవత్సరాల క్రితం వెంకటేష్ ను ప్రేమ వివహాం చేసుకుంది. ముగ్గురు పిల్లలు సంతానం కలిగిన భర్త వెంకటేష్ మద్యానికి బానిస అయ్యి, వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని కుటుంబ పోషణచూబకుండా వేధిస్తుండటంతో, విరక్తి చెందిన జ్యోతి ఇంటి వెలుపల ఉన్న దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జ్యోతి ఆత్మహత్య కు తన భర్త, అత్త, ఆడపడుచులు వేధింపులు కారణమని మృతురాలి తల్లి దేవరపల్లి విజయ్ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంకిపాడు సిఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

CHANGE OF NAME

I, UPPU DURGA MAHESH, S/o.UPPU BABURAO, Resident of D.No.11-14-62, First Floor, Velagaletivari Street, Kothapet, Vijayawada-520001. NTR District, AP. I submit that My name is UPPU DURGA MAHESH, S/o. UPPU BABURAO. Whereas my name was worngly mentioned in my Educational Certificates as NAKKA DURGA MAHESH Hence I want to change my name from NAKKA DURGA MAHESH, S/o. UPPU BABURAO (Old Name) to UPPU DURGA MAHESH, S/o. UPPU BABURAO (New Name)

CHANGE OF NAME

I, UPPU SADA SIVA, S/o.UPPU BABURAO, Resident of D.No.11-14-62, First Floor, Velagaletivari Street, Kothapet, Vijayawada-520001. NTR District, AP. I submit that My name is UPPU SADA SIVA, S/o. UPPU BABURAO. Whereas my name was worngly mentioned in my Educational Certificates as NAKKA SADA SIVA Hence I want to change my name from NAKKA SADA SIVA, S/o. UPPU BABURAO (Old Name) to UPPU SADA SIVA, S/o. UPPU BABURAO (New Name)

నగరంలో సినీనటి శ్రీ లీల సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : నగరంలో ప్రముఖ సినీనటి శ్రీ లీల సందడి చేసింది.మన విజయవాడలోని పవర్ వన్ మాల్ లో ఏర్పాటుచేసిన సౌల్ ఆఫ్ సౌత్ అనే రెస్టారెంట్ ను ఆమె లాంఛనంగా ప్రారంభించింది. ఆహార ప్రియులకు సరికొత్త వంటకాలను పరిచయం చేసే విధంగా రెస్టారెంట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమె పేర్కొంది. విజయవాడలోని పవర్ వన్ మాల్ లో ఏర్పాటుచేసిన సౌల్ ఆఫ్ సౌత్ అనే రెస్టారెంట్ ను ప్రముఖ వెండితెర కథానాయకురాలు శ్రీ లీల పవర్ మెక్ వ్యవస్థాపకుడు సజ్జా కిషోర్ బాబు, ఐరన్ హిల్ గ్రూప్ కో-ఫౌండర్ విధాత తో కలసి లంచనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆహ్లాద కరమైన వాతావరణం లో ఏర్పాటు చేయబడిన రెస్టారెంట్ ను వారు పరిశీలించారు. రెస్టారెంట్ లోని వంటకాలను రుచి చూశారు. అనంతరం నటి శ్రీ లీల మీడియాతో మాట్లాడుతూ...... నగరంలో సౌత్ ఇండియా స్పెషల్స్ తో ఆహార ప్రియులకు అనుగుణంగా రెస్టారెంట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఎంతోమంది ఆహార ప్రియులకు ఈ రెస్టారెంట్ నచ్చుతుందని అన్నారు. తాను ఈ రెస్టారెంట్లో వంటకాలను రుచి చూశానని, ప్రతి స్పెషల్ ఐటమ్ నోరూరించే విధంగా తయారు చేస్తున్నారని ప్రశంసించారు.తనను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మెగా హీరో అయిన వైష్ణవ తేజ్ తో ఆదికేశవ చిత్రంలో నటించే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఐరన్ హిల్ గ్రూప్ కో-ఫౌండర్ విధాత మీడియా తో మాట్లాడారు.... నోరూరించే సౌత్ ఇండియా వంటకాల రుచులను భోజన ప్రియులకు ఆతిథ్యం అందించేందుకు ఈ రెస్టారెంట్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రెస్టారెంట్ తమకు 17వ శాఖ అని....ఆంధ్ర,కేరళ,తమిళనాడు,బెంగుళూరు,కర్ణాటకలో తమ శాఖలను విస్తరించి ఉన్నామని పేర్కొన్నారు. ఆహార ప్రియులను సంతృప్తి పరిచే విధంగా తమ సౌత్ ఇండియా వంటకాలు ఉంటాయని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కిశోర్ బాబు, నాగేశ్వర రావు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు

అకడమిక్ తో పాటు క్రీడలలో కూడా ప్రతిభ కనబరుస్తున్న మద్ది సుబ్బారావు ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులు

విశాలాంధ్ర-విజయవాద స్పోర్ట్స్ : ఏ పాఠశాల కైనా విద్యారంగంలో విద్యార్థుల మానసిక ప్రతిభతోపాటు శారీరక ప్రతిభ కూడా వన్నె తీసుకొస్తుందని పాఠశాల పాలకవర్గ అధ్యక్షులు మద్ది సుబ్బారావు తెలిపారు. అకడమిక్ తో పాటు క్రీడలపై కూడా ప్రత్యేక దృష్టి సారించిందనీ, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ బహుమతి గ్రహీత పి. శ్యామల నేతృత్వంలో నలుగురు వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడా రంగంలో ఎంతోమంది క్రీడాకారులను రాష్ట్ర జాతీయ స్తాయి పోటీలకు సిద్ధం చేస్తున్నామన్నారు. 2023-24 విద్యా సంవత్సరములో జిల్లా, రాష్ట్ర స్థాయి లో కాకుండా జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించారు. బి అభిషేక్ డాడ్జిబాల్ అసోసియేషన్ ద్వారా జాతీయ స్థాయి లో పాల్గొని నాల్గవ స్థానం సాధించాడు. రాష్ట్ర స్థాయిలో బి. ధనుష్ బాలాజీ, వి దుర్గాతేజ, కె. శ్యాంచరణ్, ఎస్. శివమణికంఠ, నాల్గవ స్థానం సాదించారు. యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, యోగా ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వారి యోగాలో రాష్ట్ర స్థాయిలో జి. గౌతమ్ వినయ్ సాయి, ఎం. మేఘనా ప్రియలు పాల్గొన్నారు.ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్విమ్మింగ్ లో వి దుర్గాతేజ, బి. ధనుష్ బాలాజీ రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారు. ఎస్జీఎఫ్- 14 విభాగం లో ఎం. అవినాష్ రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయ్యాడు.ఎస్జీఎఫ్ అండర్-14 రగ్బీలో ఎం.. అవినాష్, బిగౌతమ్, ఎం. నీతూ రాష్ట్ర స్థాయికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలు క్రీడాంశాలలో ప్రతిబి కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల పాలక వర్గం అధ్యక్షులు మద్ది సుబ్బారావు, సెక్రెటరీ, కరస్పాండెంట్ ప్రఖ్యాత చార్టర్డ్ అకౌంటెంట్ సిహెచ్. అమర్ సుధీర్, ట్రెజరర్ కొత్త నాగేశ్వరరావు అభినందించారు.

అమ్రిత సాయిలో క్యాంపస్ ప్లేసెమెంట్స్

విశాలాంధ్ర-కంచికచర్ల: మండలం పరిటాల సమీపంలోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్ కు చెందిన బ్రాడ్ టాక్సెస్ కంపెనీ లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్ తెలియ చేసారు.కంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులు కళాశాల బీటెక్ ఎంసీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వ్రాత పరీక్ష , గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్ మరియు హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో 17 మందిని కంపెనీ తరుపున మేనేజ్మెంట్ ట్రైనీ లు గా ఎంపిక చేసి 2 లక్షల వార్షిక వేతనం నిర్ణయించి వారికి నియామక ఉత్తర్వులు అంద చేసారు.ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్ మాట్లాడుతూ 2023 -24 బ్యాచ్ విద్యార్థులలో 191 మంది ఇప్పటికే ఉద్యోగాలు సాధించటం తో పాటు 12 లక్షల ప్యాకేజ్ తో సత్తా చాటారని తెలియ చేసారు.ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ %ఁ% కరెస్పాండంట్ శ్రీ కె.రామ్మోహన రావు , ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి. చిరంజీవి , అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి , ప్లేస్మెంట్ కోర్డినేటర్ బి. రామారావు మరియు అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

గిరిజనుల అభివృద్ధికి మరింత చర్చ జరగాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమ అంశాలపై మరింత చర్చ జరిగి అమలులో ఉన్న పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎకనామిక్స్, కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'భారతదేశంలో గిరిజనుల జీవితం అభివృద్ధి విస్తృతి' అంశంపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగిన ముగింపు సభకు కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య డీ సూర్యచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సదస్సులో పత్ర సమర్పణ చేసిన అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల జీవితం చాలా విభిన్నమైనదన్నారు. సమకాలీన వ్యవస్థలో వారిని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. అయితే వాటిని అందిపుచ్చుకునే దిశగా గిరిజనులు పూర్తి స్థాయిలో ముందుకు రావటం లేదని నివేదికలు చెబుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను వారికి పూర్తిస్థాయిలో అందినప్పుడు వారు చక్కని ప్రగతిని సాధించటానికి అవకాశముంటుందన్నారు. మరో అతిథిగా హజరైన అన్నామలై విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ ఆచార్యులు ఆచార్య ఆర్ రంగరాజన్ మాట్లాడుతూ గిరిజనుల జీవన విధానం అభివృద్ధికి సంబంధించి చాలా చర్చ జరుగుతున్నప్పటికీ అందులో వారి భాగస్వామ్యం ఉన్నప్పుడే అవి మంచి ఫలితాలను అందించటానికి అవకాశముంటుందని అభిప్రాయపడ్డారు. రెండు రోజుల సదస్సులో మంచి అర్ధవంతమైన చర్చ జరిగిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. విద్యారంగ పటిష్టతతో పాటుగా సామాజిక వికాసానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ సిహెచ్ వేణుబాబు తదితరులు ప్రసంగించారు.

రాష్ట్రంలో అభివృద్ధి స్పీడందుకుంది : వెలంపల్లి



విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మన రాష్ట్రంలో అభివృద్ధి స్పీడందుకుందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని 34,49,52 డివిజన్ ల సచివాలయాల పరిదిలో శనివారం నాడు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను మాజీ మంత్రి,పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు సందర్శించి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనివిధంగా ఈ కార్యక్రమాన్ని చేప్పట్టమన్నారు ప్రజలందరూ వైద్యం చేపించుకోవాలన్నారు . ఈ క్యాంపులు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. బురద చల్లడం సబబు కాదు. జనసేన టిడిపి వారు కెబిఎన్ కాలేజీ ఎదురుకు వచ్చి ఫోటో దిగాలన్నారు. జగనన్న వచ్చాకా అనేక రోడ్లు వేశామని తెలిపారు. గతంలో ఏమి చేశారని ప్రశ్నించారు. వాలు రోడ్లు వేస్తే ఈ రోజు మేము వేయనవసరం లేదని మా ప్రభుత్వం ఏర్పడి 4 ఏళ్ళు గడిచిన 2ఏళ్ళు కరోనా లో మునిగిన అభివృద్ధిని ఎక్కడ ఆపకుండా అభివృద్ధి చేశామన్నారు. ఫామ్ హౌస్ కి పరిమితం అయిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని పవన్ కళ్యాణ్ టీడీపీ నీ ఎలా మోస్తున్నాడో ప్రజలు సమాధానం చెప్పాలన్నారు. పొత్తుల పేరుతో జనసేన, టీడీపీ పార్టీలు కొట్టుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన బాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బండి పుణ్యశీల, గౌడిపేరు సుధీర్, చేపూరి శ్రీను, విశ్వనాధ రవి, యశోధర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

దివిసీమ ఉప్పెన మహా విషాదం

తలచుకొంటే ఇప్పటికీ దివిసీమ ప్రజల గుండె జలదరిస్తుంది
ఆ ఉప్పెనలో 14 వేల మంది పైగా మృత్యువాత పడగా
దివిసీమలోనే 9 వేల మంది మరణించారు.
రూ. 172 కోట్ల ఆస్తి సముద్రంపాలైంది.
1977 నవంబర్ 19 న పెను ఉప్పెనగా బీభత్సం సృష్టించింది.

విశాలాంధ్ర అవనిగడ్డ : దివిసీమను ఉప్పెన రూపంలో కబళించి నేటికి 46 సంవత్సరాలు కవస్తున్నా దివిసీమలో కనీస అవసరాలైన తాగునీరు, రహదారులను పూర్తి స్థాయిలో గత ప్రభుత్వాలు అభివృద్ధి చేయలేకపోయాయి. అవనిగడ్డ నుండి కోడూరు మీదగా హంసలదీవి, పాలకాయతిప్ప రహదారి అవనిగడ్డ నుండి నాగాయలంక మీదగా పరిసర లంక గ్రామాలకు వెళ్ళదానికి రహదారులు అధ్వానంగా ఉన్నాయి. నాగాయలంక, కోడూరు మండలాలలో జనవరి నుండి జూన్ నెల వరకు తాగునీటికి నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీర ప్రాంతాల్లో తుఫాను షెల్టర్లను అభివృద్ధి చేసిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా ఎక్కడ వేసిన గోంగళి అక్కడే అన్న చందనంగా దివిసీమ అభివృద్ధి మిగిలిపోయింది. నాగాయలంక మండలం ఎదురుమొండి వద్ద వాయుగుండం తీరాన్ని దాటగా గంటకు 130 నుండి 160 కి॥ మీ ॥ వేగంతో వీచిన గాలులలకు సముద్ర అలలు 8 మీ ॥ ఎత్తున ఎగిసిన రాకాశి అలల సముద్రతీర ప్రాంతాన్ని ముంచి మొత్తం తుడిచి పెట్టుకుపోయింది. దివిసీమతో పాటు గుంటూరు జిల్లా నిజాంపట్నం, రేపల్లేలో ప్రళయం సృష్టించి 14 వేల మందికి పైగా పొట్టన పెట్టుకోగా ఒక్క దివిసీమలోనే 9 వేల మంది మృత్యువాత పద్దారు. కోడూరు మండలం పాలకాయ తిప్పలో 460, మూలపాలెంలో 300, నాగాయలంక మండలం సోర్లగొందిలో 714 మంది భవనాలలో తలదాచుకున్నవారు. నాగాయలంక మండలంలోని సోర్లగొంది, నాచుగుంట, సంగమేశ్వరం, ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ, ఏటిమోగ, కమ్మనమోల, దీనదయాళపురం, గుల్లలమోద, నాలి, భావదేవరపల్లి గ్రామాలను కోడూరు మండలంలోరి పాలకాయతిప్ప, హంసలదీవి, ఉల్లిపాలెం , బసవనపాలెం, గొల్లపాలెం, ఊటగుండం, ఇరాలి గ్రామాలు ఉప్పెన తాకిడికి తుడిచి పెట్టుకుపోయాయి. సముద్ర తీర ప్రాంతం నుండి సుమారు 20కి॥మీ॥ సముద్రం నీరు చొచ్చుకు వచ్చిన నీటితో గ్రామాలలో బీభత్సం సృష్టించింది. ఈ ఉప్పెన తాకిడికి గుట్టలు, చెట్లు పట్టుకుని కొంత మంది ప్రాణాలు కాపాడుకొగా, కోడూరు మండలంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో తలదాచుకున్నవారు మాత్రమే బ్రతికారు.

ఆ కాలరాత్రిని దివిసీమ మరువలేదు :

43 సంవత్సరాల క్రితం సరిగ్గా ఇదే తేదిన పెను తుఫాను విలయతాండవం చేసింది. ఈ తేదీ గుర్తుకు వస్తే నేటికి దివిసీమ గుండెల్లో వణుకు పుట్టుకు వస్తుంది. ఈ తుఫానులో 9 వేల మందికి పైగా జల సమాధి కాగా లక్షల సంఖ్యలో పసువులు, గొర్రెలు, మేకలు చనిపోగా వేలల్లో కోళ్ళు మృత్యువాత పడగా, 170 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాల్లినట్లుగా అప్పటి ప్రభుత్వ లెక్కలు తెలియచేస్తున్నాయి. అప్పటి శాసనసభ్యులు దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు స్ఫూర్తితో ఉప్పెన అనంతరం సినీనాటక రంగ కళాకారులు, విదేశీలు, స్వచ్ఛంద సంస్థలు పలువురు సేవా తత్పరులు అందించిన సేవలు మరువలేనివి. మండల పరిధిలోని పులిగడ్డలో నిర్మించిన పైలాన్ ఉప్పెన మృతుల కాలరాత్రికి సాక్షం దివిసీమ . ఉప్పెన ఆ కాలరాత్రిలో ఉప్పెన మీదపడి గ్రామాలకు గ్రామాలనే శవాల దిబ్బగా మార్చివేసింది. రాత్రికి రాత్రే నిద్దరలోనే శవాలుగా మారిపోయారు. తల్లి పొత్తిళ్ళలో సేదతీరుతున్న చిన్నారులను రాకాశి అలలు నిద్రలోనే మింగేశాయి. ఎక్కడా చూసినా ఇలాంటి హృదయ విదారక దృశ్యాలేనెన్నో దివిసీమలోనే ప్రళయ భీభత్సం సృష్టించింది. ఆ పెను ఉప్పెన మిగిల్చిన విషాదం అంతా ఇంతకాదు. నవంబరు 19 తో దివిసీమ ఉప్పెనకు 46 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈ వ్యాసం. ఉప్పెన మృతుల సంస్మరనార్థం గాంధీక్షేత్రంలో ఇదే రోజు సభ నిర్వహించి మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ పులిగడ్డ వద్ద నిర్మితమైన స్థూపం వద్ద పలు పార్టీల నేతలు కొవ్వొత్తులను వెలిగించి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఉండటం ఆనాదిగా జరుగుతూనే ఉంది.

టీమిండియాకు విద్యాలయ విద్యార్థుల ఆల్ ది బెస్ట్

విశాలాంధ్ర-గుడివాడ : మూడొవ సారి ఇండియా వరల్డ్ కప్ గెలవాలని ఆకాంక్షిస్తూ చిన్నారులు ఇండియన్ క్రికెట్ టీంకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. శనివారం స్థానిక విద్యాలయ స్కూల్ విద్యార్థులు రేపు అహ్మదాబాద్‌లో జరగనున్న వరల్డ్ కప్పు ఫైనల్లో ఆస్ట్రేలియాపై టీమిండియా ఘన విజయం సాధించాలని కోరుతూ జీతేగా జీతేగా ఇండియా జీతేగా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ వరల్డ్ కప్పులో ఆడిన 10 మ్యాచులు ఘనవిజయం సాధించిన భారత్ జట్టు ఫైనల్లో కూడా అదే ప్రదర్శన కనబరిచి తప్పకుండా కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షను నెరవేరుస్తుందని, విద్యాలయ స్కూల్ కరస్పాండెంట్ బొప్పన విజయభాస్కర్ ఆకాంక్షించారు. రెపరెపలాడుతున్న ఇండియన్ ఫ్లాగ్ పట్టుకొని ఆల్ ది బెస్ట్ టీమిండియా అంటూ చిన్నారులు నినాదాలు చేశారు.

మొద్దు నిద్రపోతున్న జగన్ ఇకనైనా కళ్ళు తెరువు : తాతయ్య

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తెలుగుదేశం పార్టీ జనసేన సంయుక్తంగా పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిపోలు నుండి రేకులగడ్డ వరకు గుంతలు పడిన రోడ్డును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ నాగరికతకు చిహ్నాలు రోడ్ల రూపురేఖలను బట్టి ఆయా ప్రాంతాల అభివృద్ధిని అంచనా వేయవచ్చు అన్నారు. పరిశ్రమలు రావాలన్నా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా రహదారులు కీలకం కానీ మన రాష్ట్రంలో రోడ్లు అస్తవ్యస్తమై దాదాపు ధ్వంసమయ్యాయి అన్నారు. కొన్నిరోడ్ల ఆనవాళ్లు కూడా కనిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలోమండల టిడిపి అధ్యక్షులు చింతల సీతారామయ్య,జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి,కర్ల వెంకటనారాయణ,జిల్లేపల్లి సుధీర్ బాబు, గజ్జి కృష్ణమూర్తి, చుంచు రమేష్, నంబూరి శ్రీనివాసరావు, నల్లపునేని కొండ,ఈమని కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

గయాజుద్దీన్ ఆధ్వర్యంలో మందికి విందు భోజనం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గ్యార్మీ వేడుకల సందర్భంగా శనివారం రాత్రి భవానిపురంలోని మసీదే రజా వీధిలోని మసీదు వద్ద దాదాపు వేల మంది ముస్లిం సోదరులకు విందు భోజనాలను ఐజా గ్రూప్ చైర్మన్, జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్ (ఐజా) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐజా మాట్లాడుతూ ఏక్యూ రజా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా వేలాదిమంది ముస్లిం సోదరులకు భోజనాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నేడు 17వ గ్యార్మీ మహెూత్సవం సందర్భంగా ముస్లిం సోదరులకు చక్కటి భోజనాన్ని ఏర్పాటు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు ఐజా పేర్కొన్నారు. అల్లాహ్ కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు ఐజా చెప్పారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మత పెద్దలు, మసీద్ రజ ప్రెసిడెంట్ షేక్ కలీం , షేక్ ఖాజా ,షేక్ ఫరూఖ్, హుసేన్ ఖాన్ , షేక్ కరిముల్ల ,అబ్దుల్ మున్న తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నుండి బయలుదేరిన భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దేశంలోని విశిష్టమైన ప్రదేశాలను సందర్శించేందుకు,భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పే లక్ష్యంతో రైల్వే మంత్రిత్వ శాఖ రైలు ప్రయాణం ద్వారా అనుసంధానించడానికి భారత్ గౌరవ్ రైలు అనే పేరుతో ఏడు జ్యోతిర్లింగాలకు ఆధ్యాత్మిక యాత్రను మొదటిసారిగా విజయవాడ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరటం ఎంతో సంతోషకరమని డిఆర్ఎం నరేంద్ర ఎ. పాటిల్ తెలిపారు. శనివారం 10 నెంబర్ ప్లాట్‌ఫామ్ నుండి రాత్రి 8 గంటలకు 159 మంది యాత్రికులతో ఏడు జ్యోతిర్లింగాలకు ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించారు. ఈ రైలు ఉజ్జయిని (మహాకాళేశ్వర్ -ఓంకారేశ్వర్), వడోదర (స్టాట్యూ ఆఫ్ యూనిటీ), ద్వారక, సోమనాథ్, నాసిక్ (త్రయంబకేశ్వర్), పూణే (భీమ శంకర్),ఔరంగాబాద్ (గ్రీష్ణేశ్వర్ ఆలయం) వంటి ముఖ్యమైన యాత్రా స్థలాలను కవర్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం వలపల్లి రాంబాబు, జీజీఎం పి రాజ్ కుమార్, ఏజీఎం కౌశిక్ బెనర్జీ,కిషోర్ సత్య, జేజీఎం, స్టేషన్ మేనేజర్ రవి ప్రకాష్,ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులతడకగా 'పశ్చిమ' ఓట్ల జాబితా ... పోతిన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తప్పులతడక పశ్చిమ నియోజకవర్గం ఓట్ల జాబితా ఉందని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నగర అధ్యక్షులు, రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ అన్నారు. శనివారం విజయవాడ కొత్తపేట లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లు తొలింపు ప్రక్రియ చేపట్టకపోతే ప్రజాస్వామ్యానికే పెనుముప్పుకలుగు తోందన్నారు. ఓటర్ల జాబితాలో ఫోటోలు ఉంచి, వివరాలు ఎందుకు నమోదు చేయలేదని అన్నారు. 2019 నుంచి 2024 వరకు 22995 ఓట్లు ఏవిధంగా పెరిగాయని, 2023లో 18 సంవత్సరాలు నిండిన వారు 1245 మంది ఓటర్ నమోదు చేసుకున్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తికి రెండు ఓట్లు, మూడూ ఓట్లు బూత్ లెవెల్ ఆఫీసర్లు నమోదు చేశారని, మరణించిన వారివి, ఈ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిన వారిని నియోజకవర్గంలో ఒక ఇంటి నుంచి వేరే ఇంటికి మారిన వారి ఓట్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించలేదన్నారు. ఈ సమావేశంలో దాసిన జైకృష్ణ(గాంధీ), శ్రీనివాస్, నోచర్ల పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఏకగ్రీవ ఆమోదం

విశాలాంధ్ర-పెడన : 2023 -24 ఏడాదికి సవరించిన బడ్జెట్లో మిగులు 5.15 కోట్లని పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి వెల్లడించారు. పెడన పురపాలక సంఘంలో 2023 ఏడాదికి సవరించిన బడ్జెట్ను 2024-25 ఏడాదికి అంచనాల బడ్జెట్ను ప్రత్యేక సమావేశంలో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. శనివారం ఉదయం పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. తొలుత ప్రత్యేక సమావేశంలో చైర్పర్సన్ మాట్లాడుతూ 2023-24 ఏడాదికి సంబంధించి సవరించిన బడ్జెట్ ప్రకారం వచ్చిన ఆదాయంలో (ఖర్చులు) వ్యయం పోను 2024-25 ఏడాదికి అంచనాల బడ్జెట్లో మిగులు బడ్జెట్ 5.15, కోట్లు ఉందన్నారు. మున్సిపల్ ఆదాయం అంతంత మాత్రమే అయిన ఖర్చులకు సంబంధించి ఔట్ స్పోర్సింగ్ జీతాలు అధికంగా ఉన్నాయని అయినా మిగులు బడ్జెట్ ఉందని అన్నారు. ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ కూడా రావడం లేదని చైర్ పర్సన్ తెలిపారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ పదవి చేపట్టే నాలుగు నెలలు మాత్రమే అయిందని గతంలో ఎలా ఉండేదో కూడా పరిస్థితి తెలియదని బాధ్యతలు చేపట్టిన తర్వాత మున్సిపల్ అధికారులతో పన్నుల వసూలు పై ప్రత్యేక సమావేశం నిర్వహించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో కంటే ఈ ఏడాది ఇంటి నీటి పన్నులతోపాటు ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులు కూడా పూర్తిస్థాయిలో వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఖాజా, బైలపాటి. జ్యోతి , మున్సిపల్ కమిషనర్ బి మహేంద్ర, టౌన్ ప్లానింగ్ బి ఏసుబాబు, సీనియర్ అసిస్టెంట్ సుందరం, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి కార్యక్రమాలకు వెలంపల్లి శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): స్థానిక విద్యాధరపురం 44వ డివిజన్ లోని సుమారు 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పలు రోడ్లకు శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు. అనంతరం నూతనంగా వేసిన భారత్ గ్యాస్ గొడౌన్ రోడ్డును మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ 44లక్షల రూపాయలతో చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. జగనన్న వచ్చాకే నగరానికి మహర్దశ పట్టిందని తెలిపారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు కావలసిన అన్ని మౌలిక వసతులు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగర అభివృద్ధి జగనన్న తోనే సాధ్యమైనదన్నారు. ప్రజలకు మేలు చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. అమరావతి పేరుతో విజయవాడ నగరాన్ని మోసం చేసింది చంద్రబాబు,పవన్ కళ్యాణ్,లోకేష్ లని అన్నారు. జలిల్ ఖాన్ ఇంటి రోడ్ మేమే వేశామన్నారు. రాజకీయాలు చేయకుండా ప్రజలకు సేవ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి దుర్గారావు, మైలవరపు కృష్ణ, వీరంకి సత్యనారాయణ, చిట్టూరి రాఘవరావు, లయన్ కుమార్, ఇనపకుర్తి రాము, ఏజిఎల్ నారాయణ, గుంటుపల్లి రామదాసు, కారంశెట్టి రాధ, నెరుసు సీతారామయ్య, ఎన్ సర్వేశ్వరరావు, మూర్తి రామకృష్ణ, దోకుపర్తి సుభాకర్, సుధాకర్, దోకిపర్తి సూర్యనారాయణ, వీరజాల మధు, వళ్ళం రవి కుమార్, అంకాన్ని నాగరాజు, దుర్గా రెడ్డి, అద్దేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఖబడ్దార్ అని గర్జించిన కవి ఆవంత్స

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు ఒక నెత్తుటి బొట్టులోనే ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు ఖబడ్దార్ ఖబడ్దార్ అని గర్జించిన కవి ఆవంత్స సోమసుందర్ అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ పూర్వ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఏడు రోజులపాటు నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవములలో ఐదవ రోజు శనివారం ఉదయం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పాదరా తడబడక పాషాణములు పగుల అంటూ జన చైతన్యాన్ని ఆశించిన కవి ఆవంత్స అన్నారు. తెలుగు కవితని ఒక యోధుడిగా భావిస్తే యోధుడి చేతిలో వజ్రాయుధమై ఆయన సాక్షాత్కరిస్తారని అన్నారు. నియంతృత్వం అనేది నిజాం ఒక్కడి హక్కు కాదన్నట్లుగా అతన్ని మించిన నియంతలు రాజ్యం ఏలుతున్న నేటి పరిస్థితుల్లో సోమసుందర్ అక్షరాలు ప్రజలకు సులోచనాలేనన్నారు. ఏ కాలపు నియంత్రత్వాన్నైనా నియంతలు ఎవరైనా ఎదిరించి నిలబడటమే వజ్రాయుధకవి సోమసుందర్ శత జయంతికి ఇవ్వగలిగిన నిజమైన నివాళి అని అన్నారు. చారిత్రక, అభ్యుదయ దృష్టి కలబోసిన దృష్టి ఆవంత్సది అని, పాలకవర్గం దోపిడీ, ఆకలి, పేదల కన్నీళ్లు, ప్రపంచ యుద్ధాలు సోమసుందర్ ప్రధాన కవితా వస్తువులన్నారు. వీటికి తోడుగా కమ్యూనిస్టు సూత్రాలు ఆయన కవిత్వానికి ఒక తాత్విక వేదికని కల్పించాయన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య యోధుడు అని, సోమ సుందర్ కు సంస్కృత ఆంధ్ర భాషలపై గట్టి పట్టు ఉందని ఇంగ్లీషులో కూడా రచన చేయగల దిట్ట అని అన్నారు. తొలితరం అభ్యుదయ వాదుల్లో ఒకరుగా వెలుగొందారని అన్నారు. నేటి కాలంలో సాహితీమూర్తులు అభ్యుదయ భావావేశానికి పునరంకితులు కాగలగాలని అన్నారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు ప్రధాన వక్తగా ప్రసంగిస్తూ సమాజం కోసమే రచనలు చేసిన మహెూన్నతుడు ఆవంత్స అని అన్నారు. సమకాలీన రచయితల రచనలను విశ్లేషిస్తూ కితాబు ఇచ్చిన ఘనుడని అన్నారు. ఆవంత్స నిరంతర రచయిత అని, నా నుంచి మృత్యువు తప్ప నాకలాన్ని ఏదీ విడదీయలేదని అన్న గొప్ప రచయిత ఆయన అని అన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి వి పూర్ణచంద్ ప్రారంభోపన్యాసం చేస్తూ సోమసుందర్ యువ రచయితలకు వెన్ను దన్నుగా నిలబడ్డారని అన్నారు. అభ్యుదయ రచయిత, ప్రాచీన సాహిత్యం పై అత్యంత పట్టుగలిగినవాడు ఆవంత్స అని, ఆయన ధీ శక్తిని ప్రకటితం చేస్తూ అందరి హృదయాలను కదిలించేదిగా ఆయన రచనలు ఉంటాయని అన్నారు. వేదికపై ఆశీనులైన వారిలో పన్నాల సుబ్రహ్మణ్యభట్టు, గ్రంథాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దోగిపర్తి శంకరరావు, నీలం దుర్గారావులు పాల్గొన్నారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు బెల్లపు బాబ్జి అతిథులను స్వాగతించగా గ్రంథాలయాధికారిణి బి కృష్ణప్రియ తదితర సిబ్బంది నిర్వహణ చేశారు.

ఓటు హక్కు వినియోగం పౌరుడి బాధ్యత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఓటు హక్కు వినియోగం ప్రతి పౌరుడి బాధ్యతని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం విజయవాడ కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంబీఏ, ఎంటెక్, బీటెక్, విద్యార్థులకు "యువ ఓటర్ చైతన్య వేదిక" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ గారు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకునేలా 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఖచ్చితంగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటు హక్కు బాధ్యతగా పరిగణలోనికి తీసుకోవాలని కోరారు. ప్రజల్లో ఓటు హక్కుపై చైతన్యం వస్తేనే రాజకీయాల్లో మార్పు వస్తుందని ఓటు హక్కు వినియోగించుకొని రాజులవుతారా, ఓటు విక్రయించుకొని బానిసలవుతారా అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. ఓటు హక్కు వినియోగం రాజ్యంగంలోని ఆర్టికల్ 326 దాని పరిధిలో క్రమేణా తగ్గుతున్న ఓటు వినియోగ శాతాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజలు ఓటు వేసేముందు పార్టీని, కులాన్ని, మత్తాన్ని చూడకుండా ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకునే, సమాజ శ్రేయస్సుకై పాటుపడే వ్యక్తినే ఎంచుకోవడం ద్వారా భావి భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలియజేశారు. కొందరు నాయకులు తమ వ్యక్తగత అజెండాలతో ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను దుర్వినియోగం చేస్తున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితులలో లేరని, వారిని వారు కాపాడుకుని మరింత ముందుకు ఎదగాలనే ధోరణిలోనే ఉన్నారని తద్వారా మన బ్రతుకులు మరింత అధమపాతళానికి నెట్టి వేయబడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దేశాభివృద్ధికి, పటిష్ట ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు ఎంతో కీలకమని, వచ్చే ఎన్నికల్లో మన భాధ్యతలను గుర్తెరిగి రాజ్యంగ భద్దంగా ఓటు హక్కును వినియోగించుకుని మన జీవితాలను వెలుగులోకి నడిపే నాయకుడినే గెలిపించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కే.లక్ష్మణస్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జే.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలి శాస్త్రి, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వి.విజయ దుర్గాప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డాక్టర్ యస్.మణికంత, కళాశాల కమిటీ సభ్యులు హరగోపాల్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.